

# బ్రిటీష్ ఏజెంట్ ముస్తాబు

కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'డెవిల్'. 'ది బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్' ఉపశీర్షిక. స్వీయ దర్శకనిర్మాణంలో అభిషేక్ నామా తెరకెక్కిస్తున్నారు. పీరియాడిక్ స్పై థ్రిల్లర్ కథాంశమిది. సంయుక్తా మీనన్ కథానాయిక. ఈ చిత్రాన్ని ఈ నెల 29న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల చేయబోతున్నారు. ఈ సందర్భంగా గురువారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఎవరికీ అంతు పట్టని ఓ రహస్యాన్ని ఛేదించే బ్రిటీష్ ఏజెంట్‌గా కల్యాణ్‌రామ్ పాత్ర కొత్త పంథాలో ఉంటుంది. భారీ యాక్షన్‌తో పాటు థ్రిల్లింగ్ అంశాలతో సాగుతుంది. కల్యాణ్‌రామ్ భిన్న గెటప్స్‌లో కనిపిస్తారు. ఆయన లుక్స్‌కు మంచి స్పందన లభిస్తున్నది. పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయబోతున్నాం' అన్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సౌందర్‌రాజన్, సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు: శ్రీకాంత్ విస్సా, నిర్మాత, దర్శకత్వం: అభిషేక్ నామా.

# ఆ డైలాగ్‌తో పడిపోయా!

ఈ ఏడాది ఫిబ్రవరిలో బాలీవుడ్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రాను వివాహమాడింది అగ్ర కథానాయిక కియారా అద్వాణీ. 'షేర్షా' చిత్రంలో వీరిద్దరూ కలిసి నటించారు. అక్కడే ఈ జంట మధ్య ప్రేమ చిగురించింది. అనంతరం వివాహ బంధంతో ఒక్కటయ్యారు. ఈ నేపథ్యంలో ఇటీవల 'కాఫీ విత్ కరణ్' షోలో పాల్గొన్న కియారా అద్వాణీ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. భర్త సిద్ధార్థ్ మల్హోత్రా తనకు లవ్ ప్రపోజ్ చేసిన క్షణాలను గుర్తుచేసుకుంది. ఆమె మాట్లాడుతూ 'సిద్ధార్థ్ కుటుంబ సభ్యులతో కలిసి ఓసారి రోమ్ టూర్‌కు వెళ్లాను. అక్కడ ఓ రోజు క్యాండిల్ లైట్ డిన్నర్ చేసిన తర్వాత రోమ్ వీధుల్లో సరదాగా నడుచుకుంటూ వెళ్తున్నాం. అప్పుడు ఓ వ్యక్తి మా దగ్గరకు వచ్చి వయోలిన్ ప్లే చేస్తూ పాట వినిపించాడు. వెంటనే సిద్ధార్థ్ మోకాళ్లపై కూర్చొని 'షేర్షా' సినిమాలోని 'ఢిల్లీ కా సీదా సాదా లుండా హూ' (ఢిల్లీకి చెందిన ఓ సాధారణ అబ్బాయిని) అనే డైలాగ్ చెప్పి లవ్ ప్రపోజ్ చేశాడు. ఏదో తెలియని ఆనందంలో వెంటనే ప్రేమకు అంగీకారం తెలియజేశా. మా స్నేహితుడొకరు ఈ సంఘటనను వీడియో తీశారు. నా జీవితంలో చిరకాలం గుర్తుండిపోయే మధుర జ్ఞాపకమది' అంటూ ఆనందం వ్యక్తం చేసింది.



# 'ఉస్తాద్'తో కొత్త ప్రయత్నం

మంచు మనోజ్ ప్రయోక్తగా వ్యవహరిస్తున్న టాక్ షో 'ఉస్తాద్'. 'ర్యాంప్ ఆడిద్దాం' ఉపశీర్షిక. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. ఈ నెల 15 నుంచి ఈటీవీ విన్ ఓటీటీ వేదికలో స్ట్రీమింగ్ కానుంది. ఇటీవల ప్రోమోను విడుదల చేశారు. ఈ సందర్భంగా మంచు మనోజ్ మాట్లాడుతూ 'ఏడేళ్ల విరామం తర్వాత ఈ టాక్‌షో ద్వారా ప్రేక్షకుల ముందుకురావడం ఆనందంగా ఉంది. ఈ షో కాన్సెప్ట్ బాగా నచ్చింది. ఇదొక సెలబ్రిటీ గేమ్ షో. ఫ్యాన్స్ కోసం సెలబ్రిటీలు ఆడే ఆట ఇది. ఈ షోలో సెలబ్రిటీలు గెలుచుకున్న మొత్తాన్ని అభిమానికి అందజేస్తాం. ప్రైజ్ మనీ 50 లక్షలు, స్పెషల్ బహుమతులు కూడా ఉంటాయి. 'ఉస్తాద్' టాక్‌షో ద్వారా సరికొత్త ప్రయత్నం చేస్తున్నా. తప్పకుండా ప్రేక్షకుల్ని మెప్పిస్తుంది' అన్నారు. ఈ షోని మంచు మనోజ్ అద్భుతంగా ప్రజెంట్ చేశాడని సహనిర్మాత వివేక్ కూచిభొట్ల తెలిపారు.





# 'జాలరి' ప్రారంభం

శ్రీహరి హీరోగా రాజ్ తాళ్లూరి దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న 'జాలరి' చిత్రం గురువారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. మై 3 బాక్సాఫీస్ సంస్థ నిర్మిస్తున్నది. ముహూర్తపు సన్నివేశానికి హీరో వెంకట్ క్లాప్‌నివ్వగా, దర్శకుడు సముద్ర కెమెరా స్విఛాన్ చేశారు. దర్శకుడు మాట్లాడుతూ '1980 దశకంలో నడిచే కథ ఇది. కాన్సెప్ట్ చాలా కొత్తగా ఉంటుంది. ఫిబ్రవరి మొదటివారంలో రెగ్యులర్ షూటింగ్‌ను మొదలుపెడతాం' అన్నారు. ఈ చిత్రానికి నిర్మాతలు: ఆదిత్య పల్లా, రఘు కుడితిపూడి, సాయికిరణ్ బత్తుల, దశరథ్ గౌడ్, దర్శకత్వం: రాజ్ తాళ్లూరి.

# ఊరందరికీ మతిమరుపు వస్తే..

హరికృష్ణ, రామకృష్ణ, యాని, రేఖా నిరోషా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'తికమకతాండ'. వెంకట్ దర్శకత్వంలో తిరుపతి శ్రీనివాస రావు నిర్మించారు. ఈ నెల 15న విడుదలకానుంది. గురువారం ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఊరిలోని ప్రజలందరికీ మతిమరుపు వస్తే ఎలాంటి సంఘటనలు చోటుచేసుకుంటాయి? ఈ క్రమంలో పండే వినోదం ప్రధానంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. ఆద్యంతం నవ్వులు పంచే చిత్రమిది. వినూత్నమైన కాన్సెప్ట్‌తో ప్రేక్షకులకు కొత్త అనుభూతినందిస్తుంది' అన్నారు. 'ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్వించడమే లక్ష్యంగా ఈ సినిమా తీశాం. ప్రతి పాత్ర వినోదాన్ని పంచుతుంది' అని నిర్మాత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: హరికృష్ణన్, సంగీతం: సురేశ్ బొబ్బిలి, నిర్మాణం: టీఎస్ఆర్ మూవీ మేకర్స్.



హరికృష్ణ, యానీ, రేఖా నిరోషా, రామకృష్ణ





# కేరళలో 'గుంటూరు కారం'

మహేష్‌బాబు కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న 'గుంటూరు కారం' చిత్రం నిర్మాణం నుంచే ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నది. ఈ సినిమా ఫస్ట్‌గ్లింప్స్‌తో పాటు ఇటీవలే విడుదల చేసిన ఫస్ట్ సింగిల్ 'ధమ్ మసాలా' సంగీత ప్రియులను ఆకట్టుకుంది. దీంతో రెండో గీతంపై ఆసక్తినెలకొంది. ఈ పాటను సోమవారం విడుదల చేయబోతున్నట్లు చిత్ర నిర్మాత నాగవంశీ ఎక్స్ (ట్విట్టర్) ద్వారా తెలిపారు. ఇదిలా వుండగా ఈ సినిమాకు సంబంధించిన తాజా అప్‌డేట్ వెలువడింది. ప్రస్తుతం కేరళలోని సుందరమైన లొకేషన్లలో ఓ రొమాంటిక్ గీతాన్ని తెరకెక్కిస్తున్నారని తెలిసింది. ఈ షెడ్యూల్ అనంతరం చిత్రబృందం హైదరాబాద్‌లో మరో కీలక షెడ్యూల్‌కు ప్లాన్ చేస్తున్నారని సమాచారం. ప్రకాష్‌రాజ్, బ్రహ్మానందం, జగపతిబాబు, జయరాం తదితరులు నటిస్తున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకురానుంది.



అవికా గోర్

# నవ వధువు కథ

అవికాగోర్, నందు, అలీ రెజా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న వెబ్‌సిరీస్ 'వధువు'. పోలూరు కృష్ణ దర్శకుడు. ఎస్వీఎఫ్ పతాకంపై శ్రీకాంత్ మెహతా, మహేంద్ర సోని నిర్మిస్తున్నారు. నేటి నుంచి డిస్నీ హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ కానుంది. గురువారం ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఇటీవల ఏర్పాటు చేసిన సమావేశంలో నందు మాట్లాడుతూ 'పెళ్లి, కుటుంబ బంధాల నేపథ్యంలో ఈ సిరీస్ ఆద్యంతం ఆసక్తిని కలిగిస్తుంది. షూటింగ్ టైమ్‌లో చాలా ఎంజాయ్ చేశాను. బెంగాలీలో ఈ సిరీస్ సీజన్-2, సీజన్-3 కూడా వచ్చాయి. అయితే మన తెలుగు సిరీస్ వాటికంటే బాగుంటుంది' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'బెంగాల్ సిరీస్ 'వధువు'ను రీమేక్ చేశాం. తెలుగు నేటివిటీకి అనుగుణంగా చాలా మార్పులు చేశాం. అత్తారింటిలో అడుగుపెట్టిన ఇందు అనే నవ వధువు కథ ఇది. సెకండ్ ఎపిసోడ్ నుంచి అసలు కథ మొదలవుతుంది. ఆద్యంతం ఉత్కంఠను రేకెత్తించే కథ, కథనాలతో సాగుతుంది' అన్నారు. ఈ వెబ్ సిరీస్‌కు కెమెరా: రామ్ కె మహేశ్, సంగీతం: శ్రీరామ్ మద్దూరి, దర్శకత్వం: పోలూరు కృష్ణ.

# విద్యార్థి నాయకుడిగా సూర్య

తమిళ అగ్ర హీరో సూర్య ప్రయోగాలకు పెట్టింది పేరు. కమర్షియల్ సినిమాలతో పాటు సామాజిక ఇతివృత్తాలను ఎంచుకొని సినిమాలు చేస్తుంటారు. ఆకాశం నీ హద్దురా, జై భీమ్ వంటి చిత్రాలు స్ఫూర్తివంతమైన కథాంశాలతో ప్రేక్షకాదరణ పొందాయి. ప్రస్తుతం సూర్య పీరియాడిక్ చిత్రం 'కంగువ'లో నటిస్తున్నారు. వచ్చే వేసవిలో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో సుధా కొంగర దర్శకత్వంలో తన తదుపరి సినిమాకు సిద్ధమవుతున్నారు సూర్య. వీరిద్దరి కాంబినేషన్‌లో గతంలో 'ఆకాశం నీ హద్దురా' వంటి సూపర్‌హిట్ చిత్రమొచ్చిన విషయం తెలిసిందే. తాజా సమాచారం ప్రకారం 1965లో తమిళనాడులో జరిగిన యధార్థ సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నట్లు తెలిసింది. హిందీ భాషకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన రాజేంద్రన్ అనే వ్యక్తి జీవిత కథ ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు తెలిసింది. ఈ సినిమాలో సూర్య విద్యార్థి నాయకుడిగా కనిపిస్తారని సమాచారం.



# ఆత్మలు నిజంగా హాని చేస్తాయా?

శ్రీరామ్, ఖుషీ రవి జంటగా నటిస్తున్న చిత్రం 'పిండం'. 'ది స్కేరియస్ట్ ఫిల్మ్' ఉపశీర్షిక. సాయికిరణ్ దైదా దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రాన్ని యశ్వంత్ దగ్గుమాటి నిర్మిస్తున్నారు. ఈ నెల 15న ప్రేక్షకుల ముందుకురానుంది. గురువారం ట్రైలర్‌ను విడుదల చేశారు. 'మరణం అనేది నిజంగా అంతమా? మరణించిన తర్వాత ఏం జరుగుతుందో ఎవరైనా చెప్పగలరా? ఆత్మలు నిజంగా హాని చేస్తాయా? అంటూ అవసరాల శ్రీనివాస్ సంధించే ప్రశ్నలతో ట్రైలర్ ఆసక్తికరంగా మొదలైంది. చాలా కాలం ఖాళీగా ఉన్న ఓ పాత ఇంటిలోకి హీరో శ్రీరామ్ కుటుంబం రావడం, అక్కడ వారికి అనుకోని సంఘటనలు ఎదురుకావడం ఉత్కంఠను పంచింది. 'మీ కుటుంబాన్ని వేధిస్తున్నది ఒక్క ఆత్మ కాదు' అనే డైలాగ్ మరింత ఉత్కంఠను రేకెత్తించింది. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఆకట్టుకున్నాయి. యధార్థ సంఘటనల స్ఫూర్తితో మూడు కాల వ్యవధుల్లో ఈ సినిమాను తెరకెక్కించామని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: సతీష్ మనోహర్, సంగీతం: కృష్ణసౌరభ్ సూరంపల్లి, కథ: సాయికిరణ్ దైదా, కవి సిద్ధార్థ.





